విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

99492 22450

ప్రభాత సూర్య
www.suryaa.news



PRABHATA SURYA

# ప్రభాత సూర్య

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

హైదరాబాద్

9-5-2026

వెల: రూ.5/-

పేజీలు: 8


సంపుటి: 09

సంచిక: 240

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## ప్రతిష్టంభనలో విజయ్ ప్రమాణ స్వీకారం

### మద్దతు ప్రకటించినా అధికారికంగా లేఖ ఇవ్వని వీసీకే



- నాలుగు డిమాండ్లకు అంగీకరించాలని పట్టు
- నేడు తుది నిర్ణయం తీసుకొనే అవకాశం
- విజయ్‌కి గవర్నర్ నుంచి ఇంకా అందని ఆహ్వానం
- వీసీకే మద్దతు ఇస్తే నేడే దళపతి ప్రమాణ స్వీకారం
- బయటి నుంచే మద్దతు ఇస్తామన్న సీపీఐ, సీపీఎం
- బెంగళూరుకు చేరిన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి నరాలు తెగే ట్విస్టులు చోటు చేసుకున్నాయి. జోసెఫ్ విజయ్ అనే నేను.. అంటూ శనివారం ప్రమాణ స్వీకారానికి

2లో

## బడిలోనే ఇంటర్మీడియట్



### 12వ తరగతి దాకా పాఠశాలలోనే

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- టెన్త్ కు, ఇంటర్‌కు ఇక నుంచి ఒకటే బోర్డు
- విద్యార్థుల డ్రాపవుట్లు తగ్గించడం, మౌలిక వసతులను మెరుగుపరచుకోవడమే లక్ష్యం
- త్వరలోనే ఆర్డినెన్స్ జారీకి ప్రభుత్వం నిర్ణయం

**హైదరాబాద్, ప్రభాత సూర్య :**

పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఇకపై ఇంటర్మీడియట్ కోసం కాలేజీలకు వెళ్లరు. ఎందుకంటే ఆయా స్కూళ్లలోనే ఇంటర్ (12వ తరగతి)ను ప్రవేశపెట్టాలని తెలంగాణ

## రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య దారుణహత్య

### జూబ్లీహిల్స్‌లో నగలు, నగదు కోసం నేపాలీ గ్యాంగ్ ఘాతుకం

### ఇంట్లో పనిమనిషి సహకారంతో దోపిడీ



బంజారాహిల్స్ (హైదరాబాద్): బంగారు నగలు, నగదు కోసం నేపాలీ గ్యాంగ్ ఘాతుకానికి పాల్పడింది. హైదరాబాద్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య నోట్లో గుడ్డలు


8లో

## లక్ష్యం.. 2 లక్షలు

- పరేడ్ గ్రౌండ్స్ మార్గంలో ఏర్పాటు చేసిన బీజేపీ ఫ్లెక్సీలు
- భారీ జనసమీకరణకు బీజేపీ కసరత్తు..
- రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలతోపాటు ప్రజలను ప్రధాని మోదీ సభకు రప్పించేందుకు ఏర్పాట్లు
- ఎక్కడికక్కడ జిల్లాల వారీగా ముఖ్య నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల, డీకే అరుణల నిత్య పర్యవేక్షణ

## కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన సీఎం

- కొడంగల్ ప్రతిష్ఠను మరింత పెంచుతుంది: రేవంత్ రెడ్డి
- అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా గ్రూపులు పక్కన పెట్టాలన్న సీఎం
- కొడంగల్‌ను రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్న రేవంత్ రెడ్డి



వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం కొడంగల్ ప్రతిష్ఠను మరింత పెంచుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కర్ణాటకలోని భక్తులకు కూడా ఈ ఆలయం మరింత చేరువగా ఉంటుందని అన్నారు. కొడంగల్‌లో శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వరస్వామి (కొడంగల్ బాలాజీ) ఆలయ పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా యాగంలో

2లో



## ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల

### మొత్తం 91.72 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత

- ఫలితాలను 'ఎక్స్' వేదికగా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్
- అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్‌లోనూ ర్యాంకు కార్డుల వెల్లడి
- బీటెక్ సెకండియర్‌లోకి లేటరల్ ఎంట్రీ కోసం ఈ పరీక్ష


ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి.

2లో

## సికింద్రాబాద్‌లో దారుణం..

- ప్రేమ వ్యవహారంలో ఇంజినీరింగ్ విద్యార్థి హత్య
- యువతి బంధువుల దాడిలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి
- హెచ్చరించినా వినలేదనే కక్షతో యువతి బంధువుల దాడి
- యువకుడి మృతదేహంతో యువతి ఇంటి ముందు కుటుంబ సభ్యుల ఆందోళన
- సికింద్రాబాద్‌లో ఉద్రిక్తత

## బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు అధికారి..



- రేపే ప్రమాణస్వీకారం
- పశ్చిమ బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా కోల్‌కతాలో అధికారికంగా ప్రకటించారు
- భవానీపూర్‌లో మమతా బెనర్జీపై గెలిచిన సువేందుకే సీఎం పీఠం
- రేపు కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రమాణస్వీకారం
- ప్రధాని మోదీ హాజరుకానున్నట్లు సమాచారం

2లో

## పుదుచ్చేరిలో... ఐదోసారి సీఎం అవుతున్న రంగస్వామి

- పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ఘన విజయం
- 5 స్థానాలకు పరిమితం అయిన డీఎంకే
- 12 చోట్ల విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించిన రంగస్వామి పార్టీ

పుదుచ్చేరి సీఎం రంగస్వామి చరిత్రపుట్లోలకి ఎక్కబోతున్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన



2లో

## హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన..

### ఆ ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేయవద్దు!

- ఎల్లుండి హైదరాబాద్‌కు రానున్న ప్రధాని మోదీ
- బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఆంక్షలు
- రేపు అర్ధరాత్రి నుంచి 24 గంటల పాటు అమల్లో ఆంక్షలు
- డ్రోన్లు, పారా గ్లైడర్లను ఎగురవేయడం నిషేధం

ఎల్లుండి (మే 10) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్



2లో

# బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు అధికారి..

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభమైంది. రాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు. కోల్‌కతాలో శుక్రవారం జరిగిన బీజేపీ నూతన ఎమ్మెల్యేల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పరిశీలకుడిగా హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా... బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి పేరును అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలో బెంగాల్ తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించి, 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు తెరదించిన విషయం తెలిసిందే. మొత్తం 294 స్థానాలకు గాను 207 సీట్లు గెలుచుకొని బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఈ నేపథ్యంలో శాసనసభాపక్ష నేత ఎన్నిక కోసం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సహ పరిశీలకునిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో సువేందు అధికారి నందిగ్రామ్‌తో పాటు భవానీపూర్ స్థానం నుంచి కూడా గెలుపొందారు. ముఖ్యంగా భవానీపూర్‌లో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీపై 15 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించడం ఆయనకు కలిసొచ్చింది. మే 9న కోల్‌కతాలోని ప్రసిద్ధ బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. సువేందు అధికారి ఎన్నికతో రాష్ట్రంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

## పుదుచ్చేరిలో... ఐదోసారి సీఎం అవుతున్న రంగస్వామి

పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించడంతో, రంగస్వామి ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. మొత్తం 30 స్థానాలున్న అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 16 స్థానాలు అవసరం కాగా, ఎన్డీయే కూటమి 18 స్థానాలను (ఏఐఎన్ఆర్సీ-12, బీజేపీ-4, స్వతంత్రులు-2) కైవసం చేసుకుని స్పష్టమైన మెజారిటీని దక్కించుకుంది. రంగస్వామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్సీ 16 స్థానాల్లో పోటీ చేసి 12 చోట్ల విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. డీఎంకే 5, కాంగ్రెస్ ఒక్క స్థానానికి పరిమితం అయ్యాయి.పుదుచ్చేరి రాజకీయాల్లో అత్యంత సామాన్యుడిగా, మృదుభాషిగా పేరున్న రంగస్వామిని ఎమ్మెల్యేలందరూ తమ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో, త్వరలోనే ఆయన ఐదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ విజయం రంగస్వామి వ్యక్తిగత ఇమేజ్‌కు నిదర్శనం మాత్రమే కాకుండా, పుదుచ్చేరిలో ఎన్డీయే పట్టును మరింత బలోపేతం చేసింది.

## హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన..

మైదానంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు.బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రేపు అర్ధరాత్రి 12 గంటల నుంచి 24 గంటల పాటు డ్రోన్‌లు, పారాగ్లైడర్‌లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ విమానాలు ఎగురవేయడాన్ని నిషేధించారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి పోలీసులు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో పౌరులు ఆంక్షలను పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## సికింద్రాబాద్‌లో దారుణం..



సికింద్రాబాద్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రేమ వ్యవహారం కారణంగా ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని అత్యంత కిరాతకంగా హత్య చేశారు. హెచ్చరించినా తమ కుమార్తెతో లవ్ అఫైర్ కొనసాగిస్తున్నాడనే కోపంతో యువతి బంధువులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ హత్య జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జవహర్‌నగర్‌కు చెందిన యువన్ (23) ఒక ప్రైవేట్ కాలేజీలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అతనికి, సీతాఫల్‌మండికి చెందిన ఓ యువతికి నాలుగేళ్లుగా ప్రేమ వ్యవహారం ఉంది. ఈ విషయం తెలిసిన యువతి కుటుంబ సభ్యులు గతంలో యువన్‌ను హెచ్చరించారు. అయినప్పటికీ యువతి ఇంటికి సమీపంలోనే తన స్నేహితుడి ఇంట్లో ఉంటూ అతను ప్రేమ వ్యవహారం కొనసాగించాడు. ఈ క్రమంలో, యువన్ గురువారం రాత్రి యువతిని కలవడానికి ఆ ప్రాంతానికి వచ్చాడు. స్నేహితులతో కలిసి మొబైల్ ఫోన్‌లో క్రికెట్ మ్యాచ్ చూస్తుండగా యువతి బంధువులు అక్కడికి వచ్చి కత్తులతో దాడి చేశారు. సుమారు 17 సార్లు పొడవడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనతో సీతాఫల్‌మండిలో ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం యువన్ మృతదేహంతో అతని కుటుంబ సభ్యులు యువతి ఇంటి ముందు ఆందోళనకు దిగారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నారు. ఈ హత్యపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో శాంతిభద్రతలు క్షీణించాయని, వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. పోలీసు యంత్రాంగం బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు పెట్టడంపై దృష్టి సారించడం వల్లే శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయని ఆయన ఆరోపించారు.

# బడిలోనే ఇంటర్మీడియట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరచుకోవడం, విద్యార్థుల డ్రాపౌట్లను అరికట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విద్యాసంవత్సరం (2026-27) నుంచే దీనిని అమలు చేయాలని యోచిస్తోంది. అయితే ఈ ఏడాది కొన్ని ఎంపిక పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనుంది.

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర విద్యా వ్యవస్థలో ఓ భారీ మార్పునకు నాంది పలకబోతోంది. పదేళ్ల పాఠశాల విద్య తరువాత విద్యార్థులు ఇంటర్మీడియట్ కోసం జూనియర్ కాలేజీలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. తాము చదువుకున్న స్కూల్లోనే ప్లస్ 2 పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసేందుకు సిద్ధమైంది. కొత్త విద్యా సంవత్సరం (2026-27) మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. అయితే, పాఠశాల విద్యలో ఇంటర్ విద్యను విలీనం చేయాలంటే ఆ రెండు చట్టాలను కలిపి ఒకదాన్ని రూపొందించాలి. అందుకు పాఠశాల విద్యకు సంబంధించి తెలంగాణ విద్యాచట్టాన్ని సవరించాలని, తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర విద్యాశాఖ సైతం ప్రతి రాష్ట్రంలో పది, ఇంటర్‌కు ఒకే బోర్డు ఉండాలని సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. దీంతో తెలంగాణలో ప్రస్తుతమున్న ప్రభుత్వ పరీక్షల విభాగం (ఎస్ఎస్‌సీ బోర్డు), ఇంటర్మీడియట్ విద్యా మండలి (ఇంటర్ బోర్డు)ని కలిపి ఒకే ఉమ్మడి బోర్డును ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి బోర్డుగా మారితే జూనియర్ కళాశాలలు సైతం పాఠశాల విద్య పరిధిలోకి వస్తాయి.

**అడ్మిషన్ల షెడ్యూల్ రద్దు..**



సాధారణంగా మే నెలలో విడుదలయ్యే ఇంటర్మీడియట్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు ఈసారి విడుదల చేసిన మరుసటి రోజే హఠాత్తుగా రద్దు చేయడం విద్యా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే, ఈ నిర్ణయం వెనుక ప్రభుత్వ ప్లస్ 2 ప్రణాళిక ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్ఎస్‌సీ, ఇంటర్ బోర్డులను ఒకటిగా చేసి.. దానికి తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు (టీజీఎస్ఈబీ)గా నామకరణం చేస్తారని తెలుస్తోంది. ఈ కొత్త విధానం వల్ల డ్రాపౌట్లు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది. పాఠశాల విద్యలోకి ఇంటర్ ను తీసుకొస్తే సమగ్ర శిక్షా, పీఎం శ్రీ తదితర పథకాల కింద నిధులు పొందొచ్చునని.. మౌలిక సదుపాయలు పెంచుకోవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాక.. పాఠశాలల్లోనూ పూర్తిస్థాయి ల్యాబ్‌లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. జూనియర్ కాలేజీల్లో సైన్స్ ల్యాబ్‌లు ఉన్నాయి. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు వేరువేరుగా ఉండటం వల్ల వేరువేరు ల్యాబ్‌లు అవసరం ఉండదు. గ్రంథాలయాలను, ఇతర సౌకర్యాలను సమర్థంగా వాడుకోవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు కలిసిపోయే అవకాశం.

# కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన సీఎం

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణంతో పాటు కొడంగల్‌లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌలతాబాద్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా గ్రూపులు పక్కనపెట్టి అందరం కలిసికట్టుగా పనిచేస్తే కొడంగల్ శాసనసభ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దగలుగుతామని అన్నారు.ప్రతి గ్రామంలో చిన్న సమస్యలు, బేదాభిప్రాయాలు ఉంటాయని, అవన్నీ పక్కన పెట్టి అందరూ కలిసి కట్టుగా ఉండాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని చాలామంది నాయకులు కలలు కన్నారని అన్నారు. కానీ వివిధ కారణాల చేత పలుమార్లు వాయిదాపడుతూ వచ్చిందని వ్యాఖ్యానించారు .నియోజకవర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పంతో తలపెట్టిన పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆనాడు చదువుకోవడానికి కొడంగల్ వాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు అందరూ కొడంగల్ వచ్చేలా అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు చురుగ్గా పనిచేయాలని అన్నారు. కృష్ణా-వికారాబాద్ రైల్వే లైన్‌కు కూడా సూత్రప్రాయంగా అనుమతులు తెచ్చుకున్నామని అన్నారు. ఇక్కడ అపారమైన సున్నపురాయి ఉందని తెలిపారు. టేకులగోడు ప్రాంతంలో పెద్ద ఎత్తున సిమెంట్ పరిశ్రమకు అన్ని అనుమతులు ఇచ్చామని అన్నారు. రాబోయే ఆరేళ్లలో సిమెంట్ పరిశ్రమ నిర్మాణం జరిగితే స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. పెద్ద ఇండస్ట్రియల్ పార్కును లగచర్ల దగ్గర నిర్మిస్తున్నట్టు చెప్పారు. కోస్గి నుంచి నేరుగా అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 300 అడుగుల రోడ్డు వేస్తున్నట్లు చెప్పారు.

# ప్రతిష్టంభనలో విజయ్ ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

విజయ్ సిద్ధమయ్యారన్న సంకేతాలు టీవీకే వర్గాల్లో జోష్‌ను నింపి సంబరాల్లో ముంచెత్తాయి. అదే సమయంలో మద్దతు ఇచ్చామని చెప్పి, తర్వాత యూ టర్న్ తీసుకున్న ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్), విడుదలై చిరుతైగళ్ కట్చి(వీసీకే) రూపంలో దళపతి విజయ్‌కు పెద్ద షాక్ తప్పలేదు. సీపీఎం, సీపీఐలు బయటి నుంచి మద్దతు ఇస్తూ అధికారికంగా లేఖలు ఇవ్వగా, ఐయూఎంఎల్, వీసీకే మాత్రం ఇంకా లేఖలు ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. తెరవెనుక బేరసారాల కోసమే మద్దతు విషయంలో వీసీకే తన అభిప్రాయం మార్చుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీ 108 మంది ఎమ్మెల్యేలను(విజయ్ రెండు చోట్ల నెగ్గారు) గెల్చుకున్న సంగతి తెలిసిందే. మరో 10 మంది మద్దతు సంపాదించాల్సి ఉండగా, విజయ్ పార్టీకి అండగా నిలుస్తామని సీపీఐ(2), సీపీఎం(2), కాంగ్రెస్(5) ప్రకటించాయి. మొదట వీసీకే(2) నుంచి సానుకూల స్పందన రావడంతో మొత్తం బలం 118కి చేరింది. దాంతో ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ సిద్ధమయ్యారు. శుక్రవారం రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. తమకు ప్రస్తుతం 116 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, మరో ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు లేఖలను పంపిస్తామని తెలియజేశారు. దాంతో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలంటూ విజయ్‌ని గవర్నర్ ఆహ్వానించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, విజయ్‌కి మద్దతు విషయంలో వీసీకే శుక్రవారం అర్ధరాత్రి దాకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మద్దతు లేఖ ఇవ్వలేదు. ఆ పార్టీ శనివారం తన తుది నిర్ణయాన్ని వెల్లడించనున్నట్లు సమాచారం. ఒకవేళ విజయ్‌కి మద్దతుగా ప్రకటన చేస్తే శనివారమే ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. గవర్నర్‌తో భేటీ తర్వాత విజయ్ చెన్నైలో సీపీఎం, సీపీఐ కార్యాలయాలకు వెళ్లారు. ఆయా పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. వామపక్షాల ఆఫీసులను విజయ్ సందర్శించడం ఇదే మొదటిసారి. కాంగ్రెస్‌కు ఐదుగురు ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో నలుగురు శుక్రవారం రాత్రి బెంగళూరుకు చేరుకోవడం గమనార్హం. నూతన ప్రభుత్వంలో తమకు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని వీసీకే సీనియర్ నేత వన్నియరసు పట్టుబట్టారు. ఆ పార్టీ నాలుగు డిమాండ్లు పెట్టినట్లు సమాచారం. ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు ఒక కేబినెట్ మంత్రిపదవి ఇవ్వాలని, ఎస్సీల సంక్షేమం కోసం చట్టం తీసుకురావాలని, రెండు చోట్ల గెల్చిన విజయ్ ఒకచోట రాజీనామా చేసిన పక్షంలో అక్కడి నుంచి వీసీకే అధినేత తిరుమావళవన్ పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని తేల్చిచెప్పినట్లుగా తెలుస్తోంది. అయితే, ఏదైనా కీలక శాఖ ఇచ్చేందుకు టీవీకే నాయకత్వం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. వీసీకే అధినేత తిరుమావళవన్ డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌తో భేటీ నిమిత్తం ఆయన నివాసానికి వెళ్లడంతో కొత్త చర్చను తెరమీదకు వచ్చింది. మరోవైపు విజయ్ పార్టీకి బయటి నుంచే మద్దతు ఇస్తామని, ప్రభుత్వంలో చేరే ఉద్దేశం లేదని సీపీఎం, సీపీఐ ప్రకటించాయి.

# ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఈ ఫలితాలను 'ఎక్స్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ పరీక్షలో మొత్తం 91.72 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 23న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 32,434 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 29,750 మంది అర్హత సాధించారు. ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులందరికీ మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీటెక్, బీఈ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు (లేటరల్ ఎంట్రీ) ఈసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. దీని ద్వారా విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని ఆదా చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ జరుగుతుంది.ఫలితాలు, ర్యాంకు కార్డులను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ఎువేం.ఖజూంఎష్ట్రవ.ఖజూ.స్త్రశీజ.అఅ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీంతో పాటు, విద్యార్థులకు మరింత సౌలభ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ఈసారి వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. తమ ఫోన్‌లోని వాట్సాప్ నుంచి 9552300009 నంబర్‌కు సందేశం పంపి కూడా ర్యాంకు కార్డును సులభంగా పొందవచ్చు. ఫలితాల విడుదల ప్రక్రియ పూర్తవడంతో, త్వరలోనే అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి విడుదల చేయనుంది. విద్యార్థులు తదుపరి ప్రకటనల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

# లక్ష్యం.. 2 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధాని మోదీ బహిరంగ సభను రాష్ట్ర బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. భారీ జనసమీకరణతో మోదీ సభ విజయవంతానికి కసరత్తు చేస్తోంది. గతంలో ఎన్నడూ చేయని విధంగా ముందస్తు సన్నాహాలు, ఏర్పాట్లలో పార్టీ ముఖ్య నేతలు నిమగ్నమయ్యారు. ఆదివారం పరేడ్ గ్రౌండ్స్ మోదీ సభ కోసం అన్ని జిల్లాలకు చెందిన ముఖ్య నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను, జిల్లా స్థాయి నాయకులను ఇన్‌చార్జ్‌లుగా (ఒక్కో జిల్లాకు పార్టీ నుంచి ఒకరు, ప్రజాప్రతినిధి ఒకరు) నియమించారు. ఏ జిల్లాకు ఆ జిల్లా నుంచి పార్టీ కేడర్, ప్రజలను తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేశారు. గతంలో హైదరాబాద్/సికింద్రాబాద్‌లలో మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాల సభ నిర్వహిస్తే చుట్టుపక్కల కొన్ని జిల్లాల నుంచే సమీకరణకు పరిమితమయ్యేవారు. అందుకు పూర్తి భిన్నంగా రాష్ట్ర పార్టీ యావత్ యంత్రాంగం ఇందులో నిమగ్నమైంది. జనసమీకరణకు సంబంధించి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మొదలుకొని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, కె.లక్ష్మణ్, ఎం.రఘునందన్‌రావు, అర్వింద్ ధర్మపురి, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్‌శంకర్, పైడి రాకేశ్‌రెడ్డి,, ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య పర్యవేక్షిస్తున్నారు.

# మేలుహ జంబూ భారతీయ చారిత్రక సేవ సంఘం బలోపేతానికి బహుజనులందరూ ఏకం కావాలని



## వ్యవస్థాపకుడు కంపాటి రవి బాబు

**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి):** ఖమ్మం నగరంలో మేలుహ జంబూ భారతీయ చారిత్రక సేవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆ సంఘం వ్యవస్థాపకుడు కంపాటి రవిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.భారతదేశ చరిత్ర చాలా గొప్పదని ప్రపంచంలోనే భారతదేశం చాలా ప్రధానమైన దేశమని ఈ దేశమును పూర్వం 30 కాల సంవత్సరాల క్రితం మేలుహ రాజు పరిపాలించాడని ఆ తర్వాత భరతుడు రాముడు జాంబవంతుడు పరిపాలించారని అన్నారు.పరాయి పాలన నుంచి స్వతంత్రం కోసం సుభాష్ చంద్రబోస్ భగత్ సింగ్ ఝాన్సీ లక్ష్మీబాయి సర్దార్ వల్లభాయ్ పటేల్ అంబేద్కర్ గాంధీ లాంటి మహనీయులు ఎందరో పోరాటాలు చేసి స్వాతంత్రం తెచ్చారని గుర్తు చేశారు.అలాంటి స్వతంత్ర దేశంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా జాంబవంతులు అందరూ ఏకమై ఒక తాటి మీదకు వచ్చి మన హక్కులను మనం కాపాడుకోవాలని పిలుపునిచ్చా రు.లేదంటే మన హక్కులు చేయి జారిపోయి పరాయి పాలన అయ్యే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించా రు.భారతదేశ చరిత్ర సంస్కృతి సాంప్రదాయాలను పాటించే మేలుహ జంబూ భారతీయ చారిత్రక సేవ సంఘం బలోపేతానికి బహుజనులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్ (దళితరత్న అవార్డు గ్రహీత ) బిహెచ్ పిఎస్ రాష్ట్ర నాయకులు తుంబు రాంబాబు ఎం జెబిఎస్ జిల్లా నాయకులు వజ్జా నాదేం తెలంగాణ ఆర్ఎంపి స్టేట్ ప్రెసిడెంట్ వై అర్జునరావు లైఫ్ లైన్ వ్యవస్థాపకులు జాంబవ గర్జన బహుజన యుద్ధనౌక పమ్మి రవి రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఆర్పిఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరికంటి సంజీవరావు మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ ఎల్ హెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ బద్రునాయక్ వీరనారి మనుల అధ్యక్షురాలు ఉపేంద్ర బాయ్ కళాకారులు కొమ్ము రమేష్ గోవింద గురవయ్య పాగా యోనా తురక సురేష్ మేకల రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు అర్హత అనుభవాన్ని బట్టి లోన్లు





మిర్యాలగూడ మే 8:-( ప్రభాత సూర్య): మిర్యాలగూడ పట్టణంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులలో అర్హత కలిగిన లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం శు క్రవారం మిర్యాలగూడ పట్టణంలోని జ్యోతిరావు పూలే బీసీ భవన్ లో బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమ ముఖ్యఅతిథి మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆన్లైన్ దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు బ్యాంకర్స్ అర్హత అనుభవాన్ని బట్టి లోన్లు మంజూరు చేస్తారన్నారు. నిరుద్యోగులు అవకాశాన్ని ఉపయోగించు కోవాలన్నారు . కార్యక్రమంలో 157 మంది లబ్ధిదారులు, కౌన్సిలర్లు అవుట శీను, మర్రి అంజిబాబు, పెద్ది శ్రీనివాస్ గౌడ్, వడ్డేపల్లి శ్రీనివాస్, పుట్టపాక శ్రీనివాస్, ప్రసున్న జన్నపాల సునీత, కిరణ్ కుమార్ మెప్మా టిఎంసి పి.బక్కయ్య సిఓలు ఎం.శ్రీనివాస్ వెంకటేశ్వర్లు సతీష్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

# నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో రైతు చైతన్య కార్యక్రమం





**మిర్యాలగూడ మే 8:-( ప్రభాత సూర్య):** రైతులు నీటివృధాను నివారించి ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఎన్ఎస్పి డివిజన్ నెంబర్ 3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. గోపినాథ్ కోరారు. శుక్రవారం ప్రజాపాలన పల్లె ప్రగతి 99రోజుల కార్యక్రమం నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రైతులను చైతన్య పర్చే కార్యక్రమంలో సాగర్ ఎడమ కాల్వ, మూసి నది వృధా నీటిని మళ్లించే కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు ప్రతిపాదనలు ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సహకారంతో ప్రభుత్వ ఆమోదం పొందాలని కోరారు. రానున్న ఖరీఫ్ సీజన్లో నాగార్జునసాగర్ జాలాశయం సంతృప్తికర నీటిమట్టం రాగానే ఎడమ కాల్వకు నీటివిడుదల సాధ్యమవుతుందని ఆయన అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, తక్కెళ్ళపాడు మాజీ సర్పంచ్ గుండు నరేందర్ గౌడ్ సూచించిన మూసి కాల్వ మరమ్మతులు, పూడిక తొలగించే పనులకు అంచనాలు సిద్ధం చేస్తామని 70 లక్షలు వరకు ఖర్చు అయ్యే అవకాశాలుంటాయని అంచనాలు సిద్ధం చేస్తామని ప్రభుత్వ ఆమోదం తీసుకు వస్తే పనులు పూర్తి చేస్తామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జనార్ధన్ అన్నారు. అదేవిధంగా కాల్వపల్లి చెరువు జాలు కాలువ పనులు కూడ ప్రభుత్వ ఆమోదం తీసుకోవచ్చి పనులు చేయించుకోవాలని ఆయన కోరారు. ప్రతి రైతు ప్రతి సాగు నీటిని సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ వ్యవసాయ శాఖ ఇంచార్జి అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఎఓ మేకల ఋష్యేంద్రమణి అన్నారు. ప్రత్యమ్నాయ పంటలపై దృష్టి సారించాలని రైతులను కోరారు. సమావేశంలో డిఇఇ శివ, ఎఇ బిక్షం తదితరులు పాల్గొన్నారు.



## పాడి పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి లిఎమ్మెల్సీ కె శంకర్ నాయక్

**మిర్యాలగూడ మే 8:- (ప్రభాత సూర్య)** :పాడి పశువులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ కోరారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజులు రైతు వారం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స దూడల ప్రదర్శన కార్యక్రమం శుక్రవారం దామరచర్ల పశువుల ఆసుపత్రిలో నిర్వహించారు. కార్యక్రమముఖ్య అతిథి శంకర్ నాయక్ పాడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పాడి పరిశ్రమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమని, ప్రభుత్వం రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో దామరచర్ల సర్పంచ్ బంటు రేణుకశ్రీ , కొండ లక్ష్మణ్ గౌడ్, బారెడ్డి గోవిందరెడ్డి, దారగాని సురేష్, పూర్ణచంద్ర నాయుడు పశువైద్య అధికారులు, పాడి రైతులు కరణం సైదిరెడ్డి, షేక్ జానీ, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని ప్రారంభించిన జూకంటి అనిల్... మొగులుగాని మల్లేశం...

**ఆలేరు మే 8 ప్రభాత సూర్య:** ప్రజా పాలన ప్రగతి నివేదిక 99 రోజుల ప్రణాళిక లో భాగంగా శుక్రవారం ఆలేరు మండలంలోని టంగుటూరు గ్రామంలో పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భ కోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జూకంటి అనిల్ మరియు పిఎసిఎస్ చైర్మన్ మొగులుగాని మల్లేశం ప్రారంభించారు. ఇందులో భాగంగా 35 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేయడంతో పాటు లేగ దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు. వేసవికాలంలో పశు సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గడ్డి విత్తనాల పంపిణీ చేయడం జరిగింది, ఈ కార్యక్రమం లో శారజీపేట పశువైద్యాధికారి డాక్టర్ నవీన్ రెడ్డి, ఆలేరు పశువైద్యాధికారి డాక్టర్ చైతన్య మరియు వి ఎల్ వో శ్రీనివాస్, ఓఎస్ నర్సింహులు మరియు గోపాలమిత్ర సభ్యులు సుధాకర్, కృష్ణ, అశోక్ కుమారస్వామి, వెంకటేష్, అనిల్, వేణు, స్వామి మరియు గ్రామ పాలకవర్గం, పాడి రైతులు అంజిరెడ్డి, మధు, బిక్షపతి, లింగం, శ్రీధర్, ఐలయ్య, వెంకటేష్, శ్రీకాంత్, మహిపాల్, స్వామి, నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.



## భారత ప్రధాని నరేంద్ర మోడీ సభను జయప్రదం చేయండి... కంతుల శంకర్ ..



**ఆలేరు మే 8 ప్రభాత సూర్య..:** మే 10వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణలో వేలకోట్ల అభివృద్ధి పనులు శంకుస్థాపన ప్రారంభోత్సవం చేయుటకు విచ్చేస్తున్నారని తెలంగాణలో రైల్వే మరియు జాతీయ రహదారులకు అత్యధిక బడ్జెట్ కేటాయించి రైల్వే స్టేషన్ల పునర్నిర్మాణం వరంగల్లోఎయిర్ పోర్ట్ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ తో మోడీ సర్కార్ తెలంగాణ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తుంది అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ తదుపరి 10 తేదీన సాయంత్రం నాలుగు గంటలకు పరేడ్ గ్రౌండ్లో జరిగే భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు కార్యకర్తలు ప్రజలు అభిమానులు భారీగా తరలి వచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి బాటలో తెలంగాణ ప్రజలు నీ వెంటే ఉన్నామని నిరూపించాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కంతుల శంకర్ పిలుపునిచ్చారు.

## దొమ్మర కులాన్ని గడవంశీయగా పేరు మార్చిన సందర్భంగా ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కు పాలాభిషేకం...





**ఆలేరు మే 8 ప్రభాత సూర్య :** ఆలేరు పట్టణ కేంద్రంలో శుక్రవారం దొమ్మర కులాన్ని గడవంశీయ గా పేరు మార్చిన సందర్భంగా రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,పొన్నం ప్రభాకర్ మరియు ప్రభుత్వ విప్ బిర్లా ఐలయ్య కి గడవంశీయ కులస్తులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము దొమ్మరి కులమని చెప్పుకోవడానికి చాలా ఇబ్బంది పడే వాళ్ళమని, స్కూల్లో, కాలేజీల్లో అధ్యాపకులు పిల్లలను కులము అడుగుతే చెప్పుకోలేని పరిస్థితి ఉండేదని అన్నారు. కానీ ఇప్పుడు కులాన్ని గడవంశీయ గా పేరు మార్చినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో కుల సభ్యులు కంసాని మహేష్,భాస్కర్,రాములు మానెమ్మ,కంసాని సుజాత,కృష్ణ ,వెంకటేష్ ,జయంతి,చంద్ర మౌళి,నరసింహారావు ,సుధాకర్,శంకర్,చందు,సుశీల, భారతమ్మ,అరుణ, నాగమణి,నీలమ్మ,పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో సెన్సెస్ సన్నాహక సమావేశం ....





**ఆలేరు మే 8 ప్రభాత సూర్య.. :** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జనాభా గణనకు సంబంధించిన సెన్సెస్ సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సన్నాహక సమావేశంలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు మరియు జూనియర్ పంచాయత్ సెక్రెటరీలు పాల్గొన్నారు. మండల తహశీల్దార్ మరియు చార్జ్ ఆఫీసర్ వలిగొండ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుండి జరగబోయే జనాభా గణనకు సంబందించిన అన్ని ఏర్పాట్లు గ్రామాలలో జరిగాయని, ఎన్యుమరేటర్లకు పంచాయతీ సెక్రటరీ లు అన్ని విధాలుగా సహకరిస్తారని తెలిపారు. ఎన్యుమరేటర్లు ఫీల్డ్ కు వెళ్ళేటప్పుడు ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని, జన గణన దాని ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించి ప్రశ్నలను అడగాలని కోరారు. ఎన్యుమరేటర్లు తమవెంట ఐడి కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలని అన్నారు. కొంతమంది సమాచారాన్ని ఇవ్వడానికి సంకోచిస్తారని, వారికి సమాచార గోప్యత పై భరోసా ఇవ్వాలని వారికి సూచించారు. ఎన్యుమరేటర్లు చాలా బాధ్యతతో వ్యవహరించి మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని అన్నారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవడానికి ఇంకా రెండురోజులు మాత్రమే మిగిలి వున్నదని, వీలైనంతవరకు సెన్సస్ సిబ్బంది తమ చుట్టు ప్రక్కలవారికి దీనిపై అవగాహన కల్పించి సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎర్ర లక్ష్మి, ట్రైనర్ మాస్టర్ దూడల వెంకటేష్, తిరుపతి రెడ్డి, ఏ ఎస్ ఓ మహేష్, టిపి భవాని తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారుల అభివృద్ధికి చిల్డ్రన్స్ ప్రోగ్రామ్స్ ఎంతో దోహదం చేస్తాయి

### కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి

**వేములపల్లి మే08 ప్రభాత సూర్య న్యూస్:** నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని లక్ష్మీ దేవిగూడెం గ్రామంలో గ్రేస్ షాలోమ్ ప్రేయర్ సెంటర్ ఆధ్వర్యంలో



శుక్రవారం నిర్వహించిన చిల్డ్రన్స్ ప్రోగ్రామ్స్ కార్యక్రమాన్ని ప్రేయర్ సెంటర్ నిర్వాహకులు అవి రెండ్ల రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి హాజరై చిన్నారులకు డ్రాయింగ్ బుక్స్, పెన్నులు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులలో విద్యతో పాటు సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే సమాజ సేవా దృక్పథంతో చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ సహాయ సహకారాలు అందిస్తున్న అవిరెండ్ల రమేష్‌ను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెరపాక సతీష్, బిక్షం , నాగయ్య, మౌనిక, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

### తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య



**తుర్కయంజాల్,ప్రభాత సూర్య:** రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘం పీఏసీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య అన్నారు. శుక్రవారం తొర్రూర్ డివిజన్ పరిధిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోహెడ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని అన్నారు. అదేవిధంగా రూ. 500 బోనస్ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘం డైరెక్టర్ లు వంగేటి లక్ష్మా రెడ్డి, రాంరెడ్డి, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోపాలమిత్ర పశు వైద్య శిబిరం



**మిర్యాలగూడ మే 8:-( ప్రభాత సూర్య):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం దూడల ప్రదర్శన కార్యక్రమం పశుగణాభివృద్ధి సంస్థ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మిర్యాలగూడ



మండలం అలగడప గ్రామంలో శుక్రవారం గోపాలమిత్ర పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 34 గేదెలకు పలు రకాల వ్యాధులను గుర్తించి వాటికి సంబంధించిన వైద్యాన్ని అందించారు. 46 దూడలకు నట్టల నివారణ మందులను తాగించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇంద్రపల్లి కుమారి, వార్డు మెంబర్లు నందిపాటి చైతన్య, బుడిగబోయిన సతీష్. చతుర్ల శ్రీనివాస్, మిర్యాలగూడ మండల పశు వైద్యాధికారి నాయిని దుర్గారమాదేవి, ఎల్ఎఎస్ నాగరాజు, విఎ సుభానా, గోపాలమిత్ర సూపర్వైజర్ శివారెడ్డి, ఓఎస్ కాంతమ్మ, వాలియా గోపాలమిత్రలు వెంకట్ రెడ్డి ప్రభాకర్, సందీప్, హరి, విజయేందర్, శ్రీను, అశోక్, రైతులు పాల్గొన్నారు

# ఏసీబీ దాడుల్లో బయటపడ్డ మిర్యాలగూడ మున్సిపల్ అవినీతి ,అక్రమాల చిట్టా

**మిర్యాలగూడ మే 8:-( ప్రభాత సూర్య):** నల్గొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో అవినీతి కార్యకలాపాలు, అవకతవకలు జరుగుతున్నాయని విశ్వసనీయ సమాచారం అందడంతో, నల్గొండ రేంజ్ ఎసిబి డీఎస్పీ అతని బృందం గురువారం ఉదయం నుండి శుక్రవారం తెల్లవారు జాము వరకు ఆకస్మిక తనిఖీ నిర్వహించి, రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు కార్యాలయ మొత్తం పనితీరును తనిఖీ చేయగా అవకతవకలు కనుగొనబడ్డాయని తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ బ్యూరో హైదరాబాద్ ఎస్ జోన్ జాయింట్ డైరెక్టర్ సింధు సామ్ జారీ చేసిన ప్రకటనలో తెలిపారు. 2025-26 మధ్యకాలంలో, పన్ను మదింపు రూ. 24.86 కోట్లు కాగా కేవలం రూ. 9.17 కోట్లు మాత్రమే వసూలు కాగా, రూ. 15.68 కోట్లు బకాయిగా మిగిలిపోయాయి. ఈ వసూలు జరగకపోవడం వైఫల్యాన్ని సూచిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టాన్ని కలిగించిందన్నారు. 2025-26 సంవత్సరంలో, మిర్యాలగూడ మున్సిపాలిటీలో మొత్తం 1,756 దుకాణాలకు, పన్ను మదింపు రూ. 43.3 లక్షలు కాగా, అందులో రూ. 28.35 లక్షలు చెల్లించగా, రూ. 14.95 లక్షలు బకాయి ఉన్నాయి. 2026-27లో, 1,783 దుకాణాలకు, మదింపు రూ. 36.18 లక్షలు కాగా, కేవలం రూ. 15.01 లక్షలు మాత్రమే చెల్లించగా, రూ. 21.17 లక్షలు బకాయి ఉన్నాయని ఈ లోటు తక్కువ వసూళ్లను ప్రతిబింబిస్తుందన్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టాన్ని కలిగించిందన్నారు. 2025-26 సంవత్సరంలో, అనధికార నిర్మాణాలకు సంబంధించి మొత్తం 54 ఫిర్యాదులు అందాయి చాలా కేసులలో నోటీసులు జారీ చేయబడ్డాయి, కానీ నిర్దేశిత గడువు ముగిసిన తర్వాత కూడా తదుపరి చర్యలు తీసుకోలేదన్నారు. బాధ్యతాయుత అధికారి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోలుగురి వెంకన్న ఆకస్మిక తనిఖీ సమయంలో అధికారిక అనుమతి లేకుండా గైర్హాజరైనట్లు



కనుగొనబడిందన్నారు. చేయూత పెన్షన్, జనన, మరణ విభాగంలో, 116 జనన దరఖాస్తులు, ఒక మరణ దరఖాస్తు 7 రోజుల ప్రాసెసింగ్ గడువును మించిపోయాయని ఇది జాప్యాన్ని సూచిస్తుందన్నారు. పోర్టల్‌లో ఎంట్రీ ఆప్షన్లు లేకపోవడం వల్ల 1,820 పెన్షన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. టౌన్ ప్లానింగ్‌లో, భవన నిర్మాణ అనుమతుల ద్వారా వచ్చే రాబడి, వసూళ్లు రూ. 3.29 కోట్లు 2024-25 నుండి రూ. 3.05 కోట్లకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి పడిపోయాయన్నారు. ఇది పేలవ పనితీరును సూచిస్తుందన్నారు. 2025-26 సంవత్సరానికి మ్యుటేషన్ దరఖాస్తులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి (86 దరఖాస్తులలో 61 పెండింగ్‌లో ఉన్నాయి), ఇది ప్రజా అభ్యర్థనలను సరిగా పరిష్కరించడం లేదని సూచిస్తుందన్నారు. 2026-27 సంవత్సరానికి ఆమోదాలలో వ్యత్యాసాలు ఉన్నాయి (34 ఆమోదించబడినప్పటికీ, కేవలం 18 మాత్రమే అందాయి) ఇది రికార్డుల నిర్వహణలో అవకతవకలను సూచిస్తుందన్నారు. భవన అనుమతి, లేఅవుట్, ఆక్రమణ మొదలైన రిజిస్టర్లను సరిగ్గా నిర్వహించడం లేదని కేవలం మూడు రిజిస్టర్లు మాత్రమే పాక్షికంగా ఉంచబడ్డాయని వాటిపై అధికారి సంతకాలు లేవన్నారు. అనేక భవన అనుమతి దరఖాస్తులు 21 రోజుల గడువును మించిపోయాయి, అనధికార నిర్మాణాలపై వచ్చిన 54 ఫిర్యాదులు ఎటువంటి చర్య లేకుండా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎల్ఆర్ఎస్. దరఖాస్తులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి (4,638 ప్రాసెస్ చేయబడలేదు, రూ. 15 కోట్లు వసూలు కాలేదు), ఇది తీవ్ర విధానపర లోపాలను ప్రతిబింబిస్తోందన్నారు. కార్యాలయంలో వ్యక్తిగత నగదు రిజిస్టర్‌ను నిర్వహించకపోవడం వల్ల, సిబ్బంది వద్ద ఉన్న నగదుకు జవాబు దారీతనాన్ని ధృవీకరించడం కష్టమైందన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల హాజరు రిజిస్టర్ ప్రకారం, 2026 మార్చి నెలలో కొంతమంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కొన్ని రోజులు గైర్హాజరుగా గుర్తించామని, కానీ జీతం రికార్డులు పూర్తి నెల జీతాలు క్లెయిమ్ చేసినట్లు సూచిస్తున్నాయన్నారు.

## జనాభా గణనకు సంబంధించిన సమావేశం...

**ఆలేరు మే 8 ప్రభాత సూర్య..** ఆలేరు మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జనాభా గణనకు సంబంధించిన సన్నహక సమావేశం మున్సిపల్ కమిషనర్ కే. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఆలేరు మున్సిపాలిటీకి సంబంధించిన హౌస్ లిస్టింగ్ మరియు హౌస్ సెన్సాస్ విషయంలో ఎన్యుమరేటర్లకు, సూపర్వైజర్లకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ జనాభా గణన ఎంతో ప్రాముఖ్యమైందని ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటిని లిస్టింగ్ చేయాలని అన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైతే అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు దూడల వెంకటేష్ గౌడ్, తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రాబోయే మూడు రోజులు మాత్రమే సెల్ఫ్ ఎన్యుమరేషన్ కి అవకాశం ఉందని అన్నారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా కచ్చితంగా ప్రచారం సేకరించబడుతుందని అందువల్ల ప్రజలందరూ సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకునేలా వార్డు ఆఫీసర్లు తమ తమ వార్డులలో అవగాహన కల్పించాలని తెలిపారు.




## కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో బైకు ఢీ ఒకరు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు

**మిర్యాలగూడ, మే 8:- (ప్రభాత సూర్య ):** మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ పరిధిలో జప్తివీరప్పగూడెం రోడ్డుపై శుక్రవారం సాయంత్రం ఒక రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా మరొకరికి తీవ్ర గాయ్యాలయ్యాయి. బుడ్డితండా, రాజేంద్రనగర్‌కు చెందిన ధనవత్ వెంకటేష్ (23)తోపాటు అదే గ్రామానికి చెందిన ధనవత్ లక్ష్మి (60)తో కలిసి హీరో స్ప్లెండర్ మోటార్ సైకిల్ పై మిర్యాలగూడ వైపు వెళ్తుండగా, వెంకటాద్రిపాలెం గ్రామ శివారులో చేరుకున్న సమయంలో స్విఫ్ట్ కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా వేగంగా వాహనం నడుపుతూ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో వెనుక కూర్చున్న ధనవత్ లక్ష్మి తలకు తీవ్ర గాయాలు కాగా వెంటనే మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారని రూరల్ సీఐ పిఎన్డి. ప్రసాద్ తెలిపారు. ఈ ఘటనపై మిర్యాలగూడ రూరల్ సీఐ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.









## ఘనంగా గొంగిడి మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు...

**ఆలేరు మే 8 ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపాలిటీ లో స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో టేస్కాబ్ మాజీ వైస్ చైర్మన్, మాజీ డిసిసిబి అధ్యక్షుడు గొంగిడి మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు మొరిగాడి వెంకటేష్ గౌడ్ , కౌన్సిలర్లు పాకాల మౌనిక హరీష్, యాట శివ, మాజీ కౌన్సిలర్ బేతి రాములు, పాశికంటి శ్రీనివాస్, పత్తి వెంకటేష్,యుత్ అధ్యక్షుడు పూల శ్రవణ్, జింకల భరత్ యాదవ్, మంగ అరవింద్,ఎలుగల శివ, ఎలుగల హరికృష్ణ, సీస సత్తయ్య గౌడ్, ఎండి ఫయాజ్. అరిగ చంద్రశేఖర్,టింకు, కటకం బాలరాజ్, బాసాని ప్రశాంత్, సాయి. దుడుక గణేష్. మొగిలి పాక కృష్ణ, బాబు, మొరిగాడి బాలరాజు ,మొరిగాడి సుజాత, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# పశువులను సంరక్షించండి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించండి

## ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో పశు సంవర్ధక చికిత్స మరియు అవగాహన శిబిరం నిర్వహణ

## పశువుల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన..జిల్లా అదనపు కలెక్టర్ నగేష్







**ప్రభాత సూర్య నర్సాపూర్ మే 08:** పశువుల ఆరోగ్యమే రైతుల ఆర్థికాభివృద్ధికి బలం అని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం, 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని నర్సాపూర్ మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో పశు చికిత్స మరియు అవగాహన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారుఈ కార్యక్రమానికి లిజిల్లా అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, ఈ శిబిరాన్ని ప్రారంభించి, దూడలు, గొర్రెలు, మేకలకు నులిపురుగుల నివారణ మందులు వేయించారు. అనంతరం ఖనిజ మిశ్రమాన్ని రైతులకు పంపిణీ చేశారు.ఈ శిబిరం ద్వారా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించారు. ఇందులో భాగంగా పశువులకు వైద్య సేవలు అందించగా, రైతులు పాల్గొని ఈ సేవలను సద్వినియోగించు కోవాలన్నారు.ఈ నేపథ్యంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పశుసంవర్ధక రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదని అన్నారు. పశువుల ఆరోగ్యం బాగుంటేనే రైతుకు ఆర్థికంగా లాభం చేకూరుతుందన్నారు.రైతులు పశువులకు సమయానికి టీకాలు వేయించడం, పోషకాహారం అందించడం, పరిశుభ్రత పాటించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పశువుల్లో వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశు వైద్య అధికారులను సంప్రదించాలని కోరారు.అలాగే సంతానోత్పత్తి సేవలను సద్వినియోగం చేసుకొని, పాల ఉత్పత్తి, పశు సంపదను పెంచుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం పశుసంవర్ధక రంగ అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, రైతులు వాటిని పూర్తిగా వినియోగించు కోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.అదే విధంగా రైతులకు పశు సంవర్ధక రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశువుల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య, ఏడి జనార్ధనరావు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఐకెపి, పిఎసిఎస్, ఎఫ్ సి ఐ ధాన్యం కొనుగోళ్ళలో వేగం పెంచాలి...

## ఎ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్ గా ట్రేడ్ చేసి దోపిడి చేస్తున్న మిల్లర్లు, చోద్యం చూస్తున్న ప్రభుత్వం..

## తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి..సూదగాని సత్య రాజయ్య , మండల అధ్యక్షుడు పిక్క గణేష్ ..





**ఆలేరు మే 8 ప్రభాత సూర్య:** వరి ధాన్యాన్ని కొనుగోలు వేగ వంతం చేయాలని శుక్రవారం ఆలేరు మార్కెట్ యార్డు ముందు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక రైతులతో కలిసి నిరసన తెలిపి, ధర్నా కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం ఆలేరు మండల కార్యదర్శి సూదగాని సత్య రాజయ్య మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభం అయ్యి దాదాపు నెల రోజుల కాగా,నెల రోజుల నుండి ఐకెపి, పిఎసిఎస్, ఎఫ్ సి ఐ కేంద్రాలకు ధాన్యాన్ని తెచ్చి రైతులు పడిగాపులు పడుతున్న ప్రభుత్వం స్పందించడం లేదని, మిల్లర్లు ఏ గ్రేడ్ ధాన్యాన్ని తూకం వేసిన తర్వాత, మిల్లుకు పోయిన తరువాత బి గ్రేడ్ ట్రేడ్ చేసి లక్షలాది రూపాయలు రైతాంగం నుండి దోపిడి చేస్తున్నారని,వెంటనే ఈ దోపిడిని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే మార్కెట్ యార్డు లో కనీస వసతులు కల్పించడం లేదని,రైతులు వడ్లు ఆరబెట్టడానికి, టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని,కల్లాలను సిమెంట్ తో ఏర్పాటు చేయాలని అన్నారు .రైతులకు మంచి నీటి వసతి కల్పించాలని, ఎండ వేడి కి వడ దెబ్బ తగలకుండా రైతులకు నీడ కోసం తాత్కాలిక నీడ వసతి కల్పించాలని, వర్షాలు పడితే నీరు నిలవకుండా కాలువలు, షెడ్ లకు దోనులు ఏర్పాటు చేయాలని కోరారు .లారీలను తొందరగా దిగుమతి చేసి పంపించాలని , మే 15 వరకు పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తూకం వేసినప్పుడు ఏ గ్రేడ్ ధాన్యాన్ని ఏ గ్రేడ్ గానే. కొనుగోలు చేయాలని, తహసీల్దార్ కి వినతి పత్రం అందజేశారు .ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దూపటి వెంకటేష్, మొరిగాడి రమేష్ కూలీ సంఘం నాయకులు జూకంటి పౌల్, సంగీ రాజు, ఘనగాని మల్లేశం, గ్యార అశోక్,సిద్దులు, నంగునూరి మల్లేష్, ఏసిరెడ్డి మణెమ్మ సింగిరెడ్డి అండాలు,గజ్జల రాజమణి,భాగ్యమ్మ , సునీత, అనిత, లలిత, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# బైక్ ర్యాలీ నిర్వహించిన బీజేపీ నాయకులు

**తుర్కపల్లి ,మే 8 ప్రభాతసూర్య :** తుర్కపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయ దశరథ హాజరై మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన నరేంద్ర మోడీ బహిరంగ సభ సికింద్రాబాద్ పెరేడ్ గ్రామంలో ఘనంగా జరుగుతుందని అన్నారు. మోడీ మూడవసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణలో అడుగుపెట్టిన చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా



కార్యదర్శి కొక్కొండ లక్ష్మి నారాయణ గౌడ్, రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా సీనియర్ యాట పెంటయ్య కందుకూరి చల్మయ్య, భానోత్ శత్రు నాయక్, దానబోయిన సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల రమేష్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బొల్లా నర్సింహ యాదవ్, జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి మలోత్ రమేష్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి భినారం కనకయ్య, యువ మోర్చా జిల్లా కార్యదర్శి మేకల పాండు యాదవ్, మోత్కుపల్లి బిక్షపతి ,చిలుకూరి రమేష్, నరేష్ నాయక్ ,కనుగంటి భాను యాదవ్, రాజేందర్ నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు


# యవన్ ను కులదురహంకార హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

## కెవిపిఎస్ రాష్ట్ర కమిటి సభ్యులు పరుశురాములు డిమాండ్

**మిర్యాలగూడ మే 8:-( ప్రభాత సూర్య):** హైదరాబాద్ నగర నడిబొడ్డున గురువారం రాత్రి యవన్ అనే యువకుడు కులాంతర ప్రేమలో ఉన్నందుకు యువతీ సోదరులు బంధువులు ప్లాన్ ప్రకారం క్రూర హత్య చేశారని తక్షణమే ఆ హంతకులను కఠినంగా శిక్షించాలని కేవిపిఎస్ కమిటి రాష్ట్ర కమిటీ సభ్యులు రేమిడాల పరశురాములు కోరారు. పోలీసు ఉన్నాతధికారులను శుక్రవారం కోరారు. పరుశురాములు మాట్లాడుతూ ప్రేమించాడనే కారణంతో హత్య చేయడం శోచనీయమన్నారు. సికింద్రాబాద్ సీతాఫల్ మండి ఇందిరా నగర్ ప్రాంతంలో బిటెక్ 3వ సంవత్సరం విద్యార్థి యవన్ ను అమ్మాయి కుటుంబ సభ్యులు అతి కిరాతకంగా కత్తితో పొడిచి హత్య చేయడాన్ని కేవిపిఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ హత్యను ఎందుకు ఖండించట్లేదన్నారు. హిందువులు ప్రియబంధువులు అయితే ఎందుకు హత్య జరిగిందన్నారు .రాష్ట్రం సుమారు 150 కుల దురహంకార హత్యలు జరిగాయన్నారు. ఇప్పటికైనా కులాంతర వివాహిత రక్షణ చట్టం చేయాలనీ డిమాండ్ చేశారు. యవన్ ను హత్య చేసిన దుండగులను పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం యవన్ కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.



# ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలి...



**ఆలేరు మే 8 ప్రభాత సూర్య:** ఈనెల 10వ తేదీన హైదరాబాద్ పేరెడు గ్రౌండ్లో మోదీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బిజెపి జిల్లా నాయకులు పసుపునూరి వీరేశం ప్రజలకు పిలుపుని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలు భారతదేశాన్ని గౌరవించడానికి కారణం నరేంద్ర మోడీ తీసుకున్న ధైర్యమైన నిర్ణయాలు దేశభక్తి అని పేర్కొన్నారు. బిజెపి మరింత బలపడాలని ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ గ్రౌండ్ లో జరిగే బహిరంగ సభను దేశ భవిష్యత్తుకు మార్గదర్శక సభ అవుతుందని అన్నారు. ఆలేరు మండలం నుండి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారతీయ జనతా పార్టీ కేంద్రంలో మూడవసారి అధికారం చేపట్టిన తర్వాత తెలంగాణ రాష్టానికి మొదటిసారిగా విచ్ఛ?ేతున్న సందర్భంగా సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయవలసిందిగా కోరారు.

# చిన్నారిని ఆశీర్వదించిన రాయల, సాధు రమేష్ రెడ్డి



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడవల్లి నాగరాజు కుమార్తె పుట్టు వెంట్రుకల మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సాధు రమేష్ రెడ్డి పాల్గొని చిన్నారి హర్షిణీ నీ ఆశీర్వదించారు.ఖమ్మం సుడా చైర్మన్ గా నియమితులైన పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ని నేలకొండపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడవల్లి నాగరాజు శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ గజ్జెల వెంకన్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ జెర్రిపోతుల సత్యనారాయణ రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు అజయ్ తండా సర్పంచ్ తేజావత్ శివాజీ మంద్రాజుపల్లి సర్పంచ్ కోటేశ్వరరావు యడవల్లి సైదయ్య మారగాని అంజయ్య చిట్లా నారపరెడ్డి ఖాజామియా సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ చామకూరి వెంకట నారాయణకు ఘన సన్మానం

## నాకు సహకరించిన అధికారులకు అనధికారులకు డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు

### ఖమ్మం 19వ డివిజన్ కార్పొరేటర్ చామకూరి వెంకట నారాయణ



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** ఖమ్మం నగరం 19వ డివిజన్ కార్పొరేటర్ చామకూరి వెంకట నారాయణకు కార్పొరేటర్ గా ఐదేళ్ల పదవి పూర్తయిన సందర్భంగా నిన్న ఖమ్మంలో ఘనంగా డివిజన్ ప్రజలు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చామకూరి వెంకట నారాయణ మాట్లాడుతూ

గత 5 సంవత్సరాలుగా మీ ఆశీస్సులు ప్రేమ సహకారంతో కార్పొరేటర్ గా సేవ చేసే అవకాశం నాకు లభించింది. ఈ ప్రయాణంలో ప్రజల సమస్యలను తెలుసుకొని అభివృద్ధి పనులు చేయడం నా జీవితంలో ఒక గొప్ప అనుభవంగా నిలిచిపోతుంది. మీ నమ్మకం ఆదరణ వల్లనే నేను ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వహించగలిగాను. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవకే అంకితమైన నిత్యం డివిజన్ ప్రజల కోసం పనిచేసేవాడని ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ శంకర్ జవాన్ నాగరాజు పాషా నర్సిరెడ్డి భాస్కర్ బాల శివరాం శ్యామల రాజు వరికోటి భాస్కర్ మల వెంకట్ విజయలక్ష్మి స్రవంతి కన్నెబోయిన ముత్తయ్య కొలిక పొంగు రమేష్ యాదవ్ నరేష్ డాక్టర్ నాగేశ్వరరావు మాడుగుల నాగేశ్వ్రరావు వీరస్వామి మల కొండయ్య నాగ దుర్గ శీలం గోపాల్ గణేష్ అజయ్ రాము శ్యామ్ లక్కీ మాజీ కార్పొరేటర్ నాగేశ్వ్రరావు మొర్రి మేకల కోటయ్య పగడాల హనుమంతరావు రామనాధం చామకూరి శంకర్ చామకూరి రాము బొమ్మిశెట్టి ఉపేందర్ మండె శ్రీను కళంగి దేవుడు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి జోయాలుక్కాస్ లో ద వరల్డ్స్ ఫేవరెట్ బ్రిలియన్స్ డైమండ్ సరికొత్త జ్యూవెలరీ షో

**రూ.1 లక్ష కంటే ఎక్కువ కొనుగోలు చేస్తే బంగారు నానం మీ సొంతం**

**మే 8 నుండి జూన్ 24 వరకు కొనసాగుతుంది... ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జోయ్ అలుక్కాస్**



**కూకట్ పల్లి, మే 08 (ప్రభాత సూర్య) :** ద వరల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్, జోయాలుక్కాస్, మే 8 నుండి 24, 2026 వరకు కూకట్‌పల్లిలోని కెపిహెచ్‌బి మెయిన్ రోడ్‌లో ఉన్న తమ షోరూమ్‌లో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'తో తెలంగాణను అబ్బురపరచడానికి సిద్ధంగా ఉంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రదర్శన డైమండ్ జ్యువెలరీలో నైపుణ్యం, సొగసు, ఆవిష్కరణల యొక్క మరపురాని వేడుకగా ఉంటుందని వాగ్దానం చేస్తుంది. పెళ్లి సెట్ల నుండి రోజువారీ మెరుపుల వరకు, ఈ ప్రదర్శనలో సాంప్రదాయ, ఆధునిక శైలి మేళవింపుతో కూడిన ఆభరణాలు ఉన్నాయి. ప్రతి డిజైన్ ఒక కళాఖండం, ఇది షో సమయంలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జోయ్ అలుక్కాస్ మాట్లాడుతూ 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' అనేది వజ్రాల యొక్క శాశ్వత ఆకర్షణకు, జ్యువెలరీ డిజైన్‌లో పరిపూర్ణత పట్ల మాకున్న అభిరుచికి నిదర్శనం. కూకట్‌పల్లి మా హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది, పండుగ సీజన్‌లో జరిగే ఈ ప్రదర్శన వినియోగదారులకు అందం, వ్యక్తిత్వం, అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రతిబింబించే డిజైన్‌లను కనుగొనడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తుంది." ఈ సందర్భంగా, వినియోగదారులు ఎగ్జిబిషన్ వ్యవధిలో రూ.1 లక్ష, అంతకంటే ఎక్కువ విలువైన డైమండ్ జ్యువెలరీ కొనుగోలుపై ఉచిత బంగారు నాణేన్ని పొందుతారు. ఇది షాపింగ్ అనుభవానికి మరింత మెరుపును ఇస్తుంది. బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' 2026 మే 24 వరకు జోయాలుక్కాస్ కూకట్‌పల్లి షోరూమ్‌లో ప్రత్యేకంగా నిర్వహించబడుతుంది. సందర్శకులు వజ్రాల యొక్క అద్భుతమైన ప్రపంచాన్ని అన్వేషించడానికి ఆహ్వానించబడ్డారు, ఇక్కడ ప్రతి ఆభరణం విలాసం, ప్రేమ, శాశ్వత మనోజ్ఞతను తెలియజేస్తుంది.



## మైక్ సెట్ బహుకరించిన ఆర్యవైశ్య సంఘం నేతలు

**తుర్కపల్లి ,మే 8 ప్రభాతసూర్య :** తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలోని హనుమాన్ దేవాలయానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మైక్ సెట్ ను బహూకరించారు .ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొత్త రాములు మాట్లాడుతూ గ్రామ దేవాలయానికి దాతలు1 ఆమ్ప్లిఫైర్, 5 మైకులు అందజేయడం అభినందనీయమని అన్నారు. గ్రామ అభివృద్ధికి దాతల సహకారం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గట్టు పరమేశ్వర్, జూలకంటి కృష్ణమూర్తి ,జూలకంటి రమేష్ ,గట్టు విజయ్, నంగునూరు రాజు, గట్టు చంద్రం, జూలకంటి భాస్కర్, వలబోజు ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## ఆలేరు భరత్ నగర్ లో ఘనంగా గొంగిడి మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు...



**ఆలేరు మే 8 ప్రభాత సూర్య:** ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ డిసిసిబి ఛైర్మన్ ఖాజాూదీ ఛైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో భరత్ నగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పటాకులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశికంటి శ్రీనివాస్, మాజీ పట్టణ అధ్యక్షుడు మొరిగాడి వెంకటేష్ గౌడ్ , మాజీ జిల్లా గ్రంధాల డైరెక్టర్ ఆడేపు బాలస్వామి, మోర్తాల రమణారెడ్డి. నారాయణ, సిద్ధిరాములు ,చిట్టిమిల్ల జలంధర్, బాసాని ఉమాకాంత్, కొమరయ్య ,కటకం బాలరాజు, బాసాని ప్రశాంత్, బొట్ల సిద్దు, చింటూ, అశోక్ ,మరియు తదితరులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ ఘటనపై డీజీపీకి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

**హైదరాబాద్:** రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలపై డీజీపీకి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. కరీంనగర్‌లో గురువారం మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనంపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసిన విషయం తెలిసిందే..ఈ అంశంపై డీజీపీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నేతలపై దాడులను అరికట్టాలని, శాంతిభద్రతలను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.బండి సంజయ్,ముఖ్యమంత్రి చీకటి ఒప్పందాలు, వ్యాపారాలు అందరికి తెలుసని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్‌కు అహకారం పెరిగిందన్నారు. 'మీ భాషపై మీ భాషలో చెబితే దాడులు చేస్తారా. కౌశిక్ రెడ్డి ఏమి తప్పు మాట్లాడారో చెప్పాలి. వచ్చేది మా ప్రభుత్వం. అప్పుడు బండి సంజయ్ గుజరాత్ వెళ్లి దాక్కోవాలి.అన్ని ఆధారాలను డీజీపీకి ఇచ్చాం. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతాం అని వివేకానంద గౌడ్ హెచ్చరించారు. శాంతిభద్రతలు దిగజారిపోయాయి పల్లా రాజేశ్వర్ రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. వెనుకబడిన రాష్ట్రాలలో ఏ విధంగా ఉన్నదో అదే తెలంగాణలో ఉందన్నారు.నచ్చని రాజకీయ పార్టీల నేతల కార్యాలయాలు, ఇళ్లపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో పోలీసుల చేతగానితనాన్ని డీజీపీకి వివరించినట్లు తెలిపారు.కౌశిక్ రెడ్డిని చంపాలని వచ్చారన్నారు. బండి సంజయ్ రెచ్చగొడితేనే కార్యకర్తలు వచ్చారని ఆయనపై కేసు నమోదు చేయాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: తుగ్గలి మండలం నందు పలు గ్రామాల యందు జరిగిన వైఎస్ఆర్సిపి నాయకుల యొక్క వివాహ వేడుకలకు,నూతన గృహప్రవేశ వేడుకలకు పత్తికొండ మాజీ శాసనసభ్యురాలు కంగాటి శ్రీదేవి శుక్రవారం రోజున హాజరయ్యారు. మండల పరిధిలోని గల జొన్నగిరి గ్రామంలో ప్రజ్ఞ స్కూల్ నందు జరిగిన తుగ్గలి మాజీ ఎంపీపీ ఎర్ర నాగప్ప కుమారుని వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే హాజరై వధూవరులను ఆశీర్వదించారు.అదేవిధంగా మండల పరిధిలోని పెండేకల్లు గ్రామంలో రంగన్న కుమారుని వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి హాజరయ్యారు. అనంతరం రాంపురం గ్రామ వైయస్సార్సిపి పార్టీ నాయకులు సుంకప్ప నూతన గృహప్రవేశ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్,జడ్పిటిసి పులికొండ నాయక్,మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,ఎర్రగుడి రామచంద్రారెడ్డి, శ్రీరంగడు,రాంపురం గంగాధర్,బద్రి తదితర వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీతారాములు మృతి తీరని లోటు

**నివాళులు అర్పించిన ఖమ్మం జిల్లా ముదిరాజ్ యువ ఐక్యవేదిక సంఘ యువజన నాయకులు పిట్టల శ్రీకాంత్ రాజా**



**ఖమ్మం(ప్రభాత సూర్య ప్రతినిధి):** ఖమ్మం జిల్లా సింగరేణి గ్రామం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షుడు గంగరబోయిన సీతారాములు మృతి సంఘానికి తీరని లోటు అని ఖమ్మం జిల్లా ముదిరాజ్ యువ ఐక్యవేదిక సంఘ యువజన నాయకులు పిట్టల శ్రీకాంత్ రాజా అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం సీతారాములు మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్ రాజా గ్రామానికి వెళ్లి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి గ్రామంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా మత్స్యశాఖ అధ్యక్షులు గానే కాకుండా వంట మాస్టర్ గా కూడా ఎంతోమందికి సుపరిచితులని అన్నారు. సీతారాములు అకాల మృతి తీరని లోటు అని పిట్టల శ్రీకాంత్ రాజా తెలిపారు. అతని ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలియజేశారు .నివాళులు అర్పించిన వారిలో సింగరేణి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తురక రాంబాబు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సింగరేణి అధ్యక్షులు తురక సాంబయ్య, కార్యదర్శి చింతల సంపత్ కుమార్, సింగరేణి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, ముదిరాజ్ సంఘం నాయకులు తురక నారాయణ, పెద్దమ్మ సత్యం తురక రాజు తురక రవి తురక మల్లేష్ పెద్దమ్మ మల్లేష్ గిరిపోయిన వెంకన్న గొడుగు శ్రీనివాస్ గంగరబోయిన యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు ఆపన్నహస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**ఒక లక్ష 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పంపిణీ**

**పటాన్చెరు, మే 8,ప్రభాత సూర్య :** ఆపత్కాల సమయంలో నిరుపేదలకు ఆపన్న హస్తం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రాపురం ఎస్ ఎన్ కాలనీకి చెందిన నాగారిగారి మరియమ్మ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి మంజూరైన ఒక లక్ష 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పత్రాలను శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో రామేశ్వరంబండ కౌన్సిలర్ అంతి రెడ్డి పాల్గొన్నారు

## పేదల అసైన్డ్ భూముల యజమాన్య హక్కులను సాధించాలి



**గట్టుప్పల్ ప్రభాత సూర్య మే. 8:** దళిత గిరిజన భడుగు బలగిన వర్గాలకు భూములిచ్చిన కాంగ్రెస్ పార్టీయే యజమాన్య హక్కులు ఇవలాని ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆడిటోరియం నిర్వాహించే సమీక్ష్యా సమావేశం లో పాల్గొన్నా నెషినల్ హ్యూమన్ రైట్స్ యాంటీ క్రైమ్ కంట్రోల్ తెలంగాణ స్టేట్ బోర్డ్ మెంబర్ బొట్ట నాగార్జున.మాట్లాడుతూ పేదల అసైన్డ్ భూములు ప్రభుత్వ భూములు కాదు దళితులది అని దళితులు కాయ కష్టం చేస్తే ఒచ్చిన భూములు అవి ఒకవేల హా భూములు వేరే వాళ్ళకి అమ్మిన కానీ హా భూములకు ప్రభుత్వం మే కారణమని ఎందుకు అంటే విద్య వైద్యం మంచిగా ఉంటే ఆ భూములను అమ్మే వాళ్ళు కాదు అందుకే అమ్మిన భూములు కు ప్రభుతశీ డబ్బులు చెల్లించి తిరిగి అ యొక్క భూమి ఎవరి పేరు మీద ఉందో వాళ్లకి ఈపిచలని ప్రభుత్వని అడుగుతున్న

## రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య కేసు

**సంచలన విషయాలు వెల్లడించిన సీపీ సజ్జనార్**



**హైదరాబాద్:** జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనూజ హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు మొదటగా సమాచారం వచ్చిందని తెలిపారు. రిటైర్డ్ డీజీ భార్య తనూజను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని..ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పనిమనిషి కల్పన ఈ హత్య చేసింది నేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ క్రైమ్ చేసిందని తెలిపారు. నిందితులు వెనుకాల గేటు నుంచి ఇంట్లోకి ప్రవేశించారని పేర్కొన్నారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని..తనూజ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నారని వెల్లడించారు.ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనాతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని..నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

**వాళ్లపై నిఘా ఉంచాలి:**

నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్లపై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం తనూజ హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని..అప్పటి నుంచి మృతురాలు తనూజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు.

## ఎడిటోరియల్



# బిజెపికి మరింత శక్తి !

**బెం**గాల్,తమిళనాడు, కేరళం ప్రజలు మార్పు కోరుకున్నారు. ఈ మార్పు ఎక్కువగా బిజెపికే లాభించింది. ముఖ్యంగా బెంగాల్, తమిళనాట పాలకుల అహంకారంపై ప్రజలు అంకుశం దింపారు. కేవలం కుటుంబ పాలనతో ప్రజలను విస్మరించిన మమత, స్టాలిన్‌లకు ప్రజలు గట్టి బుద్ది చెప్పారు. బిజెపికి కొత్త శక్తిని ఇచ్చారు. దేశమంతా ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూసినా..అందరి దృష్టి కేవలం బెంగాల్‌పైనే ఉంది. బెంగాల్లో మమతా బెనర్జీని బిజెపి మట్టికరిపిస్తుందా లేదా అని ఎదురు చూశారు. అనుకున్నట్లుగానే, మోడీ, అమిత్ షా ద్వయం బెంగాల్లో కూడా పాగా వేశారు. అస్సాంలో పట్టు నిల్పుకున్నారు. కలకత్తా కాళీ కరుణించింది. బిజెపికి పగ్గాలు అప్పగించిది. ఇక డబుల్ ఇంజిన్ సర్కార్ అక్కడా మార్పు కోసం యత్నించ నుంది. దేశంలో నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతానికి జరిగిన ఎన్నికల ఫలితాలు మార్పును సూచించాయి. ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా ఫలితాలు వచ్చాయి. బిజెపి, కాంగ్రెస్ ఖాతాలో మరో రాష్ట్రం పడగా, తమిళనాడులో టివికె పార్టీ తొలి ప్రయత్నంలోనే అధికారం దక్కించుకోబోతోంది. ఇక్కడ డిఎంకె మళ్లీ విజయం సాధిస్తుందన్న అంచనాలు తలకిందులయ్యాయి. కేరళంలో దశాబ్దం తరవాత కాంగ్రెస్ కూటమి అధికారం లోకి రాబోతోంది. ఇక అసోం, పాండిచ్చేరిలో బిజెపి అధికారం నిలుపుకుంది. మొత్తంగా బెంగాల్లో మమత, తమిళనాట స్టాలిన్‌ల అహంకారంపై ప్రజలు అంకుశం దింపారు. ఇది వారి స్వయంకృత ఓటమిగానే చూడాలి. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు కేరళం విజయం ఆ పార్టీకి ఊరటనిచ్చే అంశం. తమిళనాట పార్టీ పెట్టిన రెండేళ్లలోనే అధికారం చేపట్టబోతున్న విజయ్ ఓ రకంగా చరిత్ర సృష్టించారనే చెప్పాలి. నిరంకుశంగా పాలించడంతో పాటు కేవలం దక్షిణాది, హిందీ వ్యతిరకత ప్రదర్శించిన డిఎంకెకు ప్రజలు గుపాఠం చెప్పారు. బెంగాల్లో మమతా బెనర్జీ ఏకపక్ష రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. బంగ్లాదేశ్‌కు సరిహద్దు రాష్ట్రంగా ఉన్న బెంగాల్లో అవినీతి, అధికార దురహంకారం పెచ్చుమీరాయి. 15 ఏళ్లపాటు రాజ్యమేలిన బెంగాల్లో మమతా బెనర్జీ రాష్ట్రాన్ని మాఫియా కోటగా తయారు చేసుకున్నారు. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ లేదు. ఓట్ల కోసం అక్ర చొరబాటుదారులను చేరదీశారు. వారికి ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు మంజూరయ్యాయి. బంగ్లా వసలదారుల పెత్తనంలో సొంత రాష్ట్రం ప్రజలు నలిగి పోయారు. పరాయి ప్రజలుగా మారారు. అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు నిత్యకృత్యం అయ్యాయి. ఇవన్నీ ఎదరించిన వారిని మట్టు పెట్టారు. దాడులు, విధ్వంస రచన సాగింది. అందుకే వీటిలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. వరుసగా నాలుగోసారి మమతా బెనర్జీ అధికారాన్ని అందుకుంటారా? లేకుంటే మమత పాలనకు బీజేపీ చరమ గీతం పాడనుందా? అంటూ ఈ రాష్ట్ర ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దాదాపు 50 ఏళ్ల పాటు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని రెండు పార్టీలే పాలించాయి. 34 సంవత్సరాలు జ్యోతిబసు నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్, ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని ఏలాయి. కానీ ఈ సారి పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ పాగా వేయడంతో అక్కడ కొత్త చరిత్ర లిఖితం కాబోతోంది. 2021లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర పోరు నడిచింది. ఆ సమయంలో బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. దాదాపుగా ఐదేళ్లుగా అక్కడ బిజెపి వివిధ సమస్యలపై పోరాడుతూ వచ్చింది. అందుకు ఫలితం దక్కింది. బెంగాల్లో బిజెపి కాషాయ జెండా ఎగరేయడం ఓ చరిత్రగా చూడాలి. ఇకపోతే ఈ విజయం ఓ రకంగా మోడీ, అమిత్ షాల పట్టుదల, వ్యూహాత్మక రాజకీయాలకు నిదర్శనంగా చూడాలి. రాష్ట్రంలో గత మూడు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన టీఎంసీ నాలుగోసారి విజయంపై ధీమాగా ఉన్నప్పటికీ ప్రజలు ఛీకొట్టారు. మరోవైపు బెంగాల్‌లో పాగా వేయాలని శక్తియుక్తులన్నీ ధారపోసిన బీజేపీ కూడా తనదే విజయం అనిచాటుకుంది. ప్రధాని మోడీ, అమిత్ షాలు ఇక విజయోత్సవాల్లో పాల్గొనడానికి వస్తామని చెప్పారు. ఎగ్జిట్‌పోల్స్‌లో ఎక్కువశాతం మాత్రం బీజేపీకే అనుకూలంగా వచ్చాయి. అయితే, తాము 200 పైచిలుకు స్థానాల్లో గెలవబోతున్నామని సీఎం మమత ప్రకటించారు. కానీ ఓటర్లు బిజెపికే పట్టం కట్టారు. ఇక కేరళ విషయానికి వస్తే ఎన్నికల అయిపోగానే ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తన పేరు వెనుక సీఎం అనే పదాన్ని తొలగించు కున్నారు.. వృద్ధాప్యంతో పాటు పలు అవినీతి, కుంభకోణాల కారణంగా అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ లేదా యూడిఎఫ్ అధికారం చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత పదేళ్లుగా సినరయ్ విజయ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ప్రజలు మార్పు కోరుకోవడంతో యూడిఎఫ్‌కు మళ్లీ అధికారం దక్కడం ఖాయమయ్యింది. ఇక తమిళనాడు లో ఓట్ల లెక్కింపునకు ఒకరోజు ముందే రిసార్టు రాజకీయాలు మొదలయ్యాయి. ఈసారి రాష్ట్రంలో హంగ్ వస్తుందని.. తానే కింగ్ మేకర్ అవుతానన్న ధీమాతో ఉన్న టీవీకే అధ్యక్షుడు దళపతి విజయ్, తన ఎమ్మెల్యేలందరిని రిసార్టుకు తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. అనూహ్యంగా ఆయనే కింగ్ అయ్యారు. అయితే పూర్తి మెజార్టీకి దూరంలో ఉన్నారు. దీంతో ఇతర పార్టీలతో జట్టుకట్టక తప్పనిపరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో అన్న డిఎంకె కూడా రెండోస్థానంతో సత్తా చాటింది. ఎప్పుడూ ద్విముఖ పోరు జరిగే తమిళనాడులో ఈసారి త్రిముఖ పోరు సాగింది. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను డీఎంకే లేదా అన్నాడీఎంకే పార్టీలే శాసిస్తుండగా.. వీటి మధ్యలోకి ఈసారి'తమిళ వెట్రి కళగం' (టీవీకే) పార్టీతో సినీనటుడు విజయ్ ప్రవేశించారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని అధికార డీఎంకేదే ఈసారి కూడా అధికారమని మెజారిటీ ఎగ్జిట్‌పోల్ సర్వేలు ప్రకటించాయి. 'యాక్సిస్ మై ఇండియా' మాత్రం విజయ్ పార్టీ ఏకంగా 120 వరకు సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది. విజయ్ పార్టీ గెలవడంతో ఇప్పుడు తమిళనాడు లో సరికొత్త రాజకీయ శకం మొదలైనట్లే. మొత్తంగా ఫలితాలు బిజెపిలో ఆశావహ దృక్పథాన్ని నిలిపాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా కొంత తోడ్పడిందనే చెప్పాలి.

# జగమంత కుటుంబం నాది

**జగమంత కుటుంబం నాది ఏకాకి జీవితం నాది... సిరివెన్నెల సీతారామశాస్త్రి గార కలం నుండి జాలువారిన ఈ అక్షరాలు కేవలం ఒక సినిమా పాటలోని చరణాలు మాత్రమే కావు. ఈ నాలుగు మాటలలో ఒక అపురూపమైన జీవన తత్వం దాగి ఉంది. ఈ వాక్యాన్ని విన్నప్పుడు లేదా చదివినప్పుడు ప్రతి తెలుగువాడి గుండె నిండిపోతుంది.**



కంటి అంచున ఒక చిన్న నీటి పొర తారట్లాడుతుంది. ఆత్మ ఒక తెలియని ఉద్వేగంతో ఉప్పొంగిపోతుంది. ఇది ఒక వ్యక్తిగత వేదనగా అనిపించినా, దీని లోతుల్లో ఒక మహోన్నతమైన జీవన సత్యం దాగి ఉంది. ఇది మన సనాతన ధర్మం బోధించిన వసుధైక కుటుంబం అన్న వేదవాక్యానికి ఒక ఆధునిక, సజీవ అనువాదం.ఈ అనంతమైన భూమిపై నడిచే ప్రతి మనిషీ తన సొంత వారే అని, ప్రతి కన్నీరూ తన గుండెను పిండే గాయమే అని, ఎదుటివారి పెదవులపై విరిసే ప్రతి నవ్వూ తన ఆనందానికి మూలమని భావించే వారు అరుదుగా ఉంటారు. అలాంటి మహోన్నత వ్యక్తులకు ఈ మాటలు కేవలం సాహిత్యం కాదు, ఒక ముక్తిమంత్రం.మనిషిలో ఉండే అత్యుత్తమ గుణం ఏది అంటే నిస్సందేహంగా అది ప్రేమ అని చెప్పవచ్చు. అయితే, ఆ ప్రేమ ఎక్కడ మొదలై ఎక్కడ ముగుస్తుంది అనేదే అసలైన ప్రశ్న. సాధారణంగా మనిషి ప్రేమ తన స్వార్థం చుట్టూ, తన కుటుంబం చుట్టూ పరిభ్రమిస్తుంది. కానీ, ఎప్పుడైతే ఆ ప్రేమ తన ఇంటి గుమ్మం దాటి, వీధిని దాటి, తన ఊరిని, రాష్ట్రాన్ని, దేశాన్ని దాటి యావత్తు మానవ జాతిని ఒక్కసారి ఆత్మీయంగా కౌగిలించుకుంటుందో అప్పుడే అది దైవత్వానికి సమానమవుతుంది.అటువంటి విశాలమైన హృదయంతో జీవించే వ్యక్తి ఈ చీకటి నిండిన సమాజానికి ఒక వెలుగు దీపం వంటివాడు. తన చుట్టూ ఉన్న స్వార్థపు చీకటిని తరిమికొట్టి, కరుణ అనే వెలుగును నింపే ఆ కాంతి, తరతరాలకు దారి చూపే ధ్రువతారలా నిలిచిపోతుంది. ఉపనిషత్తులు చెప్పినట్లు "ఆత్మవత్ సర్వభూతేషు" అంటే అన్ని జీవులలోనూ తనను తాను చూసుకోవడం. ఇదే అసలైన జ్ఞానం, ఇదే అసలైన మనిషితనం.మన తెలుగు సంస్కృతిలో "అతిథి దేవో భవ" అన్న మాట కేవలం ఒక నినాదం కాదు, అది ఒక సంప్రదాయం. తెలుగు వారి ఆతిథ్యం ప్రపంచ ప్రసిద్ధం. పాత తరం ఇళ్ళను చూస్తే, ప్రతి ఇంటి ముందు ఒక అరుగు ఉండేది. బాటసారులు విశ్రాంతి తీసుకోవడానికి, ఆకలితో ఉన్న వారికి గుప్పెడు మెతుకులు పెట్టడానికి ఆ అరుగులు సాక్ష్యాలుగా నిలిచేవి.ఒక తెలుగు ఇల్లు అంటే అది ఒక ఆశ్రమంలాంటిది. ఆ ఇంటి గడప తొక్కిన వారు ఎవరైనా సరే ఖాళీ చేత్తో వెళ్ళరు. కనీసం ఒక చిన్న ప్రేమతో కూడిన పలకరింపునైనా మూటగట్టుకుని వెళ్తారు. ఈ సంస్కారం మన పూర్వీకులు మనకిచ్చిన అమూల్యమైన వారసత్వం. జగమంత కుటుంబం నాది అన్న భావన ఈ మట్టి నుండే పుట్టింది. అది ఒక తెలుగు ఇంటి గడప దాటి, ఈ భూగోళమంతటా విస్తరించిన తెలుగు ఆత్మ యొక్క విశ్వరూపం.

గురజాడ అప్పారావు గారు ఎప్పుడో చెప్పారు దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా అని. ఈ మాటల్లో కేవలం దేశభక్తి మాత్రమే లేదు, అది విశ్వమానవ సంక్షేమానికి ఇచ్చిన ఒక పిలుపు. అపరిచిత వ్యక్తులలో కూడా ఆత్మీయులను వెతుక్కోవాలనే ఆ స్ఫూర్తి నేటికీ జగమంత కుటుంబం నాది అనే భావనలో ప్రతిధ్వనిస్తూనే ఉంది.సమాజంలో మనకు భిన్న రకాల వ్యక్తులు కనిపిస్తారు. కొందరు కేవలం తమ గురించి మాత్రమే ఆలోచిస్తారు. కొందరు తమ కుటుంబం బాగుంటే చాలనుకుంటారు. మరికొందరు తమ కులం, మతం లేదా ప్రాంతం కోసం బ్రతుకుతారు. కానీ, చాలా అరుదైన వ్యక్తులు మాత్రమే ఈ సమస్త సృష్టి బాగుండాలని కోరుకుంటారు.అలాంటి వ్యక్తి అడుగు పెట్టిన చోట ఒక పువ్వు వికసిస్తుంది, ఒక దీపం వెలుగుతుంది, కునారిల్లుతున్న ఒక జీవితంలో ఆశ చిగురిస్తుంది. ఆ ప్రభావం కంటికి కనపడకపోవచ్చు, కానీ అది ఒక అంతర్వాహినిలా, నిశ్శబ్ద నదీప్రవాహంలా అందరి హృదయాలలో ప్రవహిస్తూనే ఉంటుంది. తన చుట్టూ ఉన్న ప్రతి మనిషికీ తోడుగా నిలబడే ఆ మహానుభావుడే నిజమైన హీరో . ఆయన ఏ హోదాలో ఉన్నా, ఎంతటి కటిక పేదరికంలో ఉన్నా ఆ హృదయంలో ఉన్న వెచ్చదనం, ఆ కళ్ళలో తొణికిసలాడే కరుణ, ఆ చేతులు అందించే నిస్వార్థ సహాయం అతన్ని ఒక సాధారణ మానవుడి నుండి మహానుభావుడిగా మారుస్తాయి. చరిత్ర పుటలు ఇలాంటి వారి పేర్లను స్వర్ణాక్షరాలతో లిఖించుకుంటాయి.జగమంత కుటుంబం నాది అనగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది స్వామి వివేకానంద గారి చికాగో ప్రసంగం. వేదికపైకి రాగానే ఆయన అమెరికా దేశపు సోదర సోదరీమణులారా! అని సంబోధించగానే, ఆ హాలులోని వేలాది మంది ఒక్కసారిగా మంత్రముగ్ధులై చప్పట్లతో హోరెత్తించారు. ఎందుకంటే, అప్పటి వరకు ఆ వేదిక మీద ప్రసంగించిన మేధావులెవరూ ప్రేక్షకులను ఒక కుటుంబ సభ్యుల్లా చూడలేదు. కానీ వివేకానంద గారు ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా అనుభవించారు. ఆ అనుభూతి నుండి వచ్చిన ఆ పిలుపు ప్రపంచాన్ని కదిలించింది. అది భారతీయ సంస్కృతి సారాంశం అయితే, అది తెలుగు ఆత్మలో జగమంత కుటుంబం నాది గా రూపాంతరం చెందింది.ఒకరికి ఉపకరించే జీవితమే సార్థకమైన జీవితం. ఎదుటివారి కన్నీళ్ళు తుడిచే చేయే నిజమైన దేవుని చేయి. ఈ సత్యాన్ని వంటబట్టించుకున్న వారు నిజంగా ధన్యులు. వారి జీవితం ఒక నిరంతర సేవాయజ్ఞం. వారికి సంకుచిత ఆలోచనలు ఉండవు. వీరు నా వారు, వారు పరాయి వారు అన్న భేదభావం వారి దరి చేరదు. ఒక ఆకలి కేక విన్నా, ఒక అనాథ బిడ్డ కంటిలో నీరు చూసినా వారి మనసు విలవిలలాడుతుంది. ఒక వృద్ధుడు ఒంటరిగా నడుస్తుంటే వారి పాదాలు అప్రయత్నంగా ఆ వృద్ధుడికి తోడుగా సాగుతాయి. ఈ సహజసిద్ధమైన కరుణే ఈ విశ్వమానవ కుటుంబ భావనకి ప్రాణం.తెలుగు సాహిత్యం ఎప్పుడూ మనిషిని మనిషిగా ప్రేమించమని బోధించింది.

అన్నమయ్య కీర్తనల్లోని బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే.. నిండార రాజు నిద్రించు నిద్రయు నొక్కటే, అండనే బంటు నిద్ర అదియు నొక్కటే అన్న చరణాలు కులమతాల అతీతమైన సమానత్వాన్ని చాటిచెప్పాయి. త్యాగరాజు స్వరాలలోని భక్తి, శ్రీనాథుని కావ్యాలలోని మాధుర్యం అన్నీ మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దడానికే ప్రయత్నించాయి. మనమంతా ఒకే దైవం నుండి ఉద్భవించామని, ఒకే శ్వాసను పంచుకుంటున్నామని, ఒకే ఆకాశం కింద నివసిస్తున్నామని గ్రహించినప్పుడు.. నాది అన్న పదానికి అర్థం మారుతుంది. అది ఒక చిన్న ఇల్లు కాదు, ఒక ఊరు కాదు, ఒక దేశం కాదు ఈ మొత్తం జగత్తు నాది అవుతుంది.నేటి డిజిటల్ యుగంలో, సోషల్ మీడియా యుగంలో మనిషి వేలమందితో కనెక్ట్ అయి ఉన్నాడు. వేలమంది ఫ్రెండ్స్ , లక్షలమంది ఫాలోవర్స్ ఉంటున్నారు. కానీ, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అంతరంగంలో మనిషి అత్యంత ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాడు. ఈ కృత్రిమ బంధాల మధ్య నిజమైన అనురాగం కరువవుతోంది. ఇలాంటి శీతలమైన ప్రపంచంలో జగమంత కుటుంబం నాది అన్న భావన ఒక వెచ్చని కౌగిలింత వంటిది.ఒక చిన్న చిరునవ్వు, ఒక చిన్న అభినందన, ఆపదలో ఉన్నప్పుడు అందించే ఒక చేయూత ఇవి చాలు, ఒక మనిషి జీవితాన్ని నిరాశ నుండి ఆశ వైపు మళ్ళించడానికి. అటువంటి అద్భుతమైన మార్పును తీసుకురాగలిగే ప్రతి వ్యక్తి ఈ భూమిపై దైవ స్వరూపుడే.మనం ప్రకృతిని గమనిస్తే అది నిరంతరం త్యాగమే చేస్తుంది. ఒక చెట్టు తన పండ్లను తాను తినదు, ఒక నది తన నీటిని తాను తాగదు, సూర్యుడు తన వెలుతురును తాను ఆస్వాదించడు. ఇవన్నీ ఇతరుల కోసమే జీవిస్తున్నాయి. అదే సృష్టి ధర్మం. మనిషి కూడా ఈ ధర్మాన్ని తూచా తప్పకుండా పాటిస్తే, తనలోని ప్రతిభను, జ్ఞానాన్ని, సంపదను సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగిస్తే అప్పుడు అతని జీవితం ఒక పరిపూర్ణ కావ్యం అవుతుంది. అతని హృదయంలో జగమంత కుటుంబం నాది అన్న భావన నిండుగా వికసిస్తుంది.చివరగా చెప్పాలంటే, జగమంత కుటుంబం నాది అన్నది కేవలం ఒక కవి రాసిన కల్పన కాదు. ఇది యుగయుగాల నుండి మానవ అంతరాత్మలో నిగూఢంగా ఉన్న సత్యం. మన తెలుగు నేలలో, మన సంస్కృతిలో, మన పాటల్లో, మాటల్లో ఈ సత్యం నిరంతరం ప్రతిధ్వనిస్తూనే ఉంది.ఈ విశ్వమానవ ప్రేమ తత్వాన్ని పుణికిపుచ్చుకుని జీవించే ప్రతి వ్యక్తి ఈ సమాజానికి ఒక వెలకట్టలేని రత్నం. ఆ రత్నపు కాంతి తరతరాలకు మార్గదర్శకంగా మారుతుంది. ఈ మహోన్నతమైన జీవన దర్శనాన్ని స్వీకరించిన వారు తమ కోసం కాకుండా, పదిమంది కోసం జీవిస్తూ ధన్యులవుతున్నారు. వారి ప్రతి అడుగు ఒక ప్రార్థన, వారి ప్రతి శ్వాస ఒక సందేశం.జగమంత కుటుంబం నాది ఆ భావనను ఊపిరిగా మలచుకుని జీవించే మీరు, ఈ జగత్తుకు నిజమైన వెలుగు!ఈ ప్రయాణం ఇంకా కొనసాగాలి. మనలో ప్రతి ఒక్కరూ ఈ భావనను గుండెల్లో నింపుకుంటే, ఈ ప్రపంచం అంతా ఒకే కుటుంబంలా మారిపోతుంది. అక్కడ ద్వేషానికి తావుండదు, కేవలం ప్రేమ మరియు కరుణ మాత్రమే రాజ్యమేలుతాయి.



డా .సూర్యదేవర
రామకృష్ణ ,
9490754169

# ప్రజాప్రతినిధులకు జీతాలు ఎందుకు ?

ఉద్యోగుల బకాయిలు ఆరువేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని కేబినేట్ భేటీలో చర్చకు వచ్చింది. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో, ఇప్పుడు రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇవి అలాగే ఉండిపోయాయి. ఇంకా పెరిగి పోతున్నాయి. అయినా చీమకుట్టినట్లుగా లేదు. ఉచిత పథకాలకు, దుబారా ఖర్చులుకు వెనకాడని ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యలే జీతాల్లో 50శాత ఇప్పుడు వీరికి చెల్లిస్తామని, వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగాచెల్లిస్తామని మంత్రులు చెప్పు కొచ్చారు. అసలు మంత్రులు, ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు? లక్షల్లో వారికి ఎందుకు చెల్లించాలి. ఎందుకు వారికి పెన్షన్లు చెల్లించాలన్నది ఆలోచించాలి. మందు వారి జీతాలను మొత్తంగానే ఆపేయాలి. పెన్షన్లను రద్దు చేయాలి. ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు ఎందుకు? పేరున్న, డబ్బున్న వారు కూడా ఇప్పటికీ పెన్షన్లు పొందుతుననారు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేనప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. దీనికితోడు ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది.అధికారంలో ఉండగా తెలంగాణను అప్పుల్లో ముంచిన బిఆర్‌ఎస్ ఇప్పుడు విపక్షంలో ఉంటూ..మరిన్ని ఉచితపథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. తులం బంగారం ఇచ్చారా.. రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీస్తున్నారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. నిజానికి గురుకులాలను లేదా హాస్టళ్లను ఒక్క గొడుగు కిందకు తీసుకుని రావాల్సి ఉంది. విద్య, వైద్యాలకు ఖర్చు చేయకుండా ఉచిత పథకాలకు చేస్తున్న ఖర్చులను వెంటనే ఆపకపోతే జీతాలు ఇవ్వలేరని తేలుతుంది. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఆర్టీసీ సమ్మెకు డబ్బులే కారణం. డబ్బులు ఇవ్వలేక, వారికి చెల్లింపులు చేయలేక,మహాలక్ష్మి పథకంతో దివాళా తీయిస్తూ, ఇవాళ ఆర్టీసీ సమ్మెలో ఓ కార్మికుడిని బలి తీసుకు న్నారు. శంకర్ గౌడ్ మృతి నిజానికి తీవ్ర విషాదం. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇలాగే ఆత్మహత్య ల కు కాంగ్రెస్ కారణమయ్యింది. ముందుగా ఆర్టీసీ సమస్యను తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో బటన్ నొక్కుడు పథకాలతో దివాళా తీయించారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంపముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు.




# మెక్సికోలో వారణాసి సీన్స్ ప్రదర్శన

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'కోసం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్తను ఎస్ఎస్ కార్తికేయ పంచుకున్నారు. మెక్సికోలో జరగనున్న ఓ సినీ వేడుకలో ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మెక్సికో వేదికగా ఏప్రిల్ 24 నుంచి 26 వరకు జరగనున్న కామిక్ కాన్ ఎక్స్‌పీరియన్స్‌లో 'వారణాసి'కి సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, బిహైండ్ ది సీన్స్‌తో పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలతో కూడిన గ్లింప్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ వేడుకకు కార్తికేయ హాజరు కానుండగా.. రాజమౌళి ప్రత్యేక వీడియో సందేశంతో అక్కడి అభిమానులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో విడుదల కానుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్ జరుగుతోంది. అంతర్జాతీయస్థాయిలో భారతీయ సినిమా సత్తాను చాటేలా ఈ సినిమాను రాజమౌళి అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నారు. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు.




# రాకా మూవీలో దీపికదే కీ రోల్

ఆమె నటించదన్న వార్తలపై టీమ్ స్పందన

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీస్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమాలో బన్నీకి జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఇటీవల ఆమె రెండోసారి తల్లి కానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమాపై రూమర్స్ మొదలయ్యాయి. షూటింగ్ ఆలస్యం అవుతుందని.. దీపిక స్థానంలో మరో నటిని తీసుకోనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిని 'రాకా' టీమ్ ఖండించింది. సినిమాలో దీపిక పాత్ర నిడివి తగ్గించారనే ప్రచారాన్ని కూడా కొట్టేసింది. సినిమాలో ఆమె పాత్ర కీలకమైనదని షూటింగ్ కూడా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారమే సాగుతోందని స్పష్టం చేసింది. రూమర్స్‌ను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో దీపిక కొన్ని క్రేజీ యాక్షన్ సన్నివేశాల్లోనూ నటించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ఆమె ఈ సీక్వెన్స్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమెతో పాటు మరికొందరు హీరోయిన్‌లు కూడా నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.

# రామాయణంలో రావణ, కుబేర యుద్ధం

బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ బ్జడెట్ చిత్రం 'రామాయణం' గురించి ఒక సంచలన వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా రామాయణం కథ అనగానే శ్రీరాముడి బాల్యం లేదా జననంతో మొదలవుతుందని మనందరికీ తెలుసు, కానీ ఈ చిత్రంలో దర్శకుడు నితీష్ తివారీ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో రావణుడిగా నటిస్తున్న కన్నడ సూపర్ స్టార్ యష్ పవర్‌ఫుల్ ఎంట్రీతో, రావణ-కుబేర యుద్ధంతో ప్రారంభం కాబోతుందని తెలుస్తుంది. తన సోదరుడైన కుబేరుడిపై దాడి చేసి, స్వర్ణ లంకను మరియు పుష్పక విమానాన్ని రావణుడు స్వాధీనం చేసుకునే ఘట్టాన్ని అత్యంత భారీ స్థాయిలో వెండితెరపై చూపించబోతున్నట్లు సమాచారం. భారతీయ సినీ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా సుమారు 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రత్యేక స్క్రీనింగ్‌లో ప్రదర్శించిన 20 నిమిషాల ఫుటేజీ చూసిన విశ్లేషకులు, ముఖ్యంగా లంకా నగరం మరియు రావణుడి యుద్ధ సన్నివేశాల్లోని ఘట్టాలు హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. రావణుడి శక్తిని, ప్రతాపాన్ని చూపే ఈ విజువల్ స్పెక్టాకిల్ మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.






# వరుస ఫ్లాప్‌లతో శ్రీలీల డిసప్పాయింట్

హిట్‌లు లేకపోవడంతో కెరీర్‌లో ఒడిదుడుకులు

కన్నడ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. ప్రారంభంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని టాప్ హీరోయిన్ రేసులోకి వచ్చిన ఆమె ఇప్పుడు మాత్రం వరుస ఫలితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి' సినిమాతో శ్రీలీల టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా? ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. మొదటి సినిమా ఎ÷-లాప్ అయినా కూడా, ఇండస్ట్రీలో ఆమెకు వరుస అవకాశాలు రావడం విశేషం. రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో శ్రీలీల కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయింది. ఆ విజయంతో ఆమె టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. వరుసగా అరడజను సినిమాలు ఆమె చేతిలో పడగా, కొన్నింటి ఫలితాలు నిరాశపరిచాయి. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, పెద్ద హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. 'పుష్ప 2'లో చేసిన ప్రత్యేక డాన్స్ నంబర్‌తో ఇతర భాషల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు తమిళ, హిందీ ఇండస్ట్రీల్లో అవకాశాలు కూడా వచ్చాయి. తమిళంలో చేసిన 'పరాశక్తి' సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో అక్కడ ఆమెకు ఆశించిన గుర్తింపు రాలేదు. ఇక హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో చేస్తున్న సినిమా ఆలస్యం అవుతుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇటీవల వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్ సరసన నటించినా? సినిమాలో ఆమె పాత్రకు పెద్దగా గుర్తింపు రాలేదు. అదే సమయంలో గత ఏడాది వచ్చిన సినిమాలు కూడా కమర్షియల్‌గా పెద్ద విజయాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో, శ్రీలీల తన భవిష్యత్తును బాలీవుడ్ సినిమాపైనే ఆధారపెట్టినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓ సినిమాలో ఆమెకు అవకాశం వచ్చిందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ సంవత్సరం శ్రీలీల



## గీతామాధురి యూట్యూబ్ ఇంటర్వ్యూ

తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తన స్వరంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ గాయని గీతా మాధురి మరోసారి వార్తల్లో నిలిచారు. పాటలతోనే కాదు, టీవీ షోలతో, సోషల్ మీడియాలో తన యాక్టివ్‌నెస్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె, తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గీతామాధురి ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూకి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, అందులో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రోమోలో గీతామాధురి మాట్లాడుతూ నేను ఎప్పుడో ఒక రోజు కాఫీ షాప్‌కి వెళ్తాను. ఆ రోజే ఏదో ఒక ప్రేమ జంట అక్కడికి వస్తుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.